ఆడ పిల్లలకు అండగా ఎమ్మెల్యే పల్లా

తల్లి లతతో పాటు ఆడబిడ్డలకు హామీ ఇస్తున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, జూలై 4 : పట్టణానికి చెందిన తండ్రి లేని ఆడ పిల్లలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అండగా నిలిచారు. తండ్రి కనక రాజు గత నెలలో ఆనారోగ్యంతో మృతి చెందడంతో తల్లి లత ఆడపిల్లలను చదివించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతూ పలువురి ఇండ్లలో కష్టపడి పని చేస్తున్నది. ఈ విషయం తెలుసుకున్న యువజన నాయకులు జితేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం పట్టణానికి వచ్చిన ఎమ్మెల్యే ఆడ పిల్లల చదవుకు భరోసా ఇచ్చారు. ముగ్గురు ఆడపిల్లల్లో మొదటి అమ్మాయిని మాడల్ స్కూల్‌లో సీటు ఇప్పిస్తానని, మూడో అమ్మాయిని పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో చదవిస్తానని హామీ ఇచ్చారు. రెండో అమ్మాయి అప్పటికే మాడల్ స్కూల్‌లో అభ్యసిస్తుండడంతో ఇద్దరు అమ్మాయిలు చదువుకునేందుకు ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో పలువురు అభినందించారు.

పొట్లపల్లిలో ప్రత్యేక పూజలు

పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్, జూలై 4: మండలంలోని పొట్లపల్లిలోని రాజేశ్వరస్వామి క్షేత్రంలో గురువారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజేశ్వరస్వామి క్షేత్రం వార్షికోత్సవంలో భాగంగా జరుగుతున్న కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రానున్న రోజుల్లో పొట్లపల్లి ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషిచేస్తానని మంత్రి అన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో మంత్రి మొక్కను నాటారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

పోతారం(ఎస్) పరిధిలో ఉన్న గురుకుల పాఠశాలను గురువారం సాయంత్రం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

నేటి నుంచి వజ్రోత్సవ వనమహోత్సవం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 4 : జిల్లాలో వజ్రోత్సవ వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ మనుచౌదరి జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా అధికారుల తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులకు ఇచ్చిన లక్ష్యాలను అనుగుణంగా మొక్కలు నాటే ప్రక్రియను వివరించారు. జిల్లా మొత్తం 21లక్షల 62వేల700 మొక్కలను వనమహోత్సవ కార్యక్రమంలో నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభించే కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి సరోజ, జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్, పంచాయతీ అధికారి దేవకీదేవి, పశుసంవర్ధకశాఖ అధికారి జగన్నాథరెడ్డి, వ్యవసాయ అధికారి మహేశ్, ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ హుస్నాబాద్'కు సహకరించాలి

తడి, పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, జూలై 4 : స్వచ్ఛతలో హుస్నాబాద్ పట్టణాన్ని ప్రథమస్థానంలో నిలిపేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో సఫాయిఅప్నాబీమారిభగావో అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తడి, పొడిచెత్తను ఇండ్ల మధ్యలో వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్ వల్లపు రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్ మెంట్‌ఇంజినీర్ రవికుమార్, బేసిల్ ఫౌండేషన్ ఫౌండర్ ఉదయ్, వార్డు అధికారులు భవాని, సాంబరాజు, ఆర్పీ పద్మతోపాటు వైద్య, ఆరోగ్య శాఖ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలను చంపిన కార్మికులపై చర్యలు

దుబ్బాక, జూలై 4 : మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో 50 కుక్కలను చంపేసిన పారిశుధ్య కార్మికులపై చర్యలు చేపట్టారు. మూడు రోజుల క్రితం లచ్చపేటలో పారిశుధ్య కార్మికులు కుక్కలను చంపిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ విషయమై జంతు సంరక్షణ కార్యకర్త అదులాపురం గౌతమ్ సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లో సీపీ అనురాధకు ఫిర్యాదు చేశారు. సీపీ అనురాధ ఆదేశాల మేరకు గురువారం లచ్చపేట వార్డులో మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్‌తో పాటు పశుసంవర్ధక శాఖ అధికారి బాల సుందరం, దుబ్బాక ఎస్సై గంగరాజు సందర్శించారు. బీసీ కాలనీలో గుంతలో కుక్కల మృతదేహాలను పూడ్చేయడంతో , వాటిని బయటకు తీసి శవ పంచానామ నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఆర్టీసీ 'లక్షే లక్ష్యం'తో అదనపు ఆదాయం

హుస్నాబాద్, జూలై 4: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేపట్టిన 'లక్షే లక్ష్యం' కార్యక్రమంతో పలు డిపోలకు అదనపు ఆదాయం సమకూరుతున్నదని హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆర్టీసీ కళాకారులు ఆ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు, ఇస్తున్న రాయితీలు, ప్రయాణంలో డ్రైవర్లు, కండక్టర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డిపోలకు అదనపు ఆదాయం సమకూర్చేలా చేయాల్సిన పనులను వివరిస్తూ డిపోతో పాటు బస్టాండ్ ఆవరణలో కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కల్పిస్తున్న రాయితీలను ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కళాకారులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

గజ్వేల్, జూలై 04 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని గజ్వేల్ బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు నవాజ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఆ ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తారో చెప్పాలన్నారు. విద్యార్థులు నిరుద్యోగులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు.

ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం


దుబ్బాక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానించిన ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది

దుబ్బాక, జూలై 4 : ఐదేండ్ల పదవీ కాలం ముగియడంతో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీపుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డితో పాటు ఎంపీటీసీలు, కోఆప్షన్‌మెంబర్ ఇస్మాయిల్‌ను ఎంపీడీవో ఉమాదేవి, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలను ప్రత్యేకాధికారి గణేశ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీసు రాజు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాయపోల్ లో..

రాయపోల్, జూలై 4 : మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం ముగియండంతో ఎంపీపీఅనిత శ్రీనివాస్, జడ్పీటీసీ యాదగిరితో ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలయ్య, గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు హాజరై పాలక వర్గాన్ని అభినందించారు.

కొమురయ్య సేవలు మరువలేనివి

హుస్నాబాద్‌లో దొడ్డి కొమురయ్య చిత్రపటం ముందు నినాదాలు చేస్తున్న కురుమసంఘం నాయకులు

చేర్యాలలో వర్ధంతి నిర్వహిస్తున్న కురుమ సామాజిక సంఘం నాయకులు

హుస్నాబాద్‌టౌన్, జూలై 4 : తెలంగాణ తొలి సాయుధపోరాట అమరుడు దొడ్డి కొమురయ్య సేవలు మరువలేమని కురుమ సంఘం మండల శాఖ అధ్యక్షుడు సూరు అయిలయ్య అన్నారు. కొమురయ్య వర్ధంతిని గురువారం అంబేద్కర్‌చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సం పత్, లింగయ్య, ఓదయ్య, శ్రీనివాస్, పెద్ది ఓదయ్య, పెద్ది సైదయ్య, రమేశ్, రంజిత్, బీరయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

కొమురయ్య స్ఫూర్తితో..

సిద్దిపేట టౌన్, జూలై 4 : దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ప్రజ సమస్యలపై ఉద్యమిస్తామని సీపీఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. కొమురయ్య వర్ధంతి సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీసభ్యులు రవికుమార్, రుణ్‌కుమార్, శిరీశ, పశాంత్, సంజీవ్‌కుమార్, నారాయణ, అభి పాల్గొన్నారు.

కొమురయ్య జీవితం ఆదర్శనీయం

గజ్వేల్, జూలై 4 : బడుగుజీవుల హక్కుల కోసం భూపోరాటం చేసిన అమరవీరుడు దొడ్డికొమురయ్య జీవితం ఆదర్శనీయమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలో దొడ్డికొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, నరేందర్ రెడ్డి, అంజియాదవ్, రమేశ్‌రాజు పాల్గొన్నారు.

కొమురయ్య స్ఫూర్తితో ముందుకు సాగాలి

కొమురవెల్లి, జూలై 4 : దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.కృష్ణారెడ్డి, రవీందర్, శారద, సాయిలు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల, జూలై 4 : దొడ్డి కొముర్య వర్ధంతిని పట్టణంలో నిర్వహించారు. కార్యక్రమంలో కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, కౌన్సిలర్ లింగం, బీరయ్య, రాజు, అశోక్, నానీ, అనిల్‌కుమార్, నాయకులు యాదవరెడ్డి, వెంకట్‌మావో, నర్సిరెడ్డి, మల్లేశం, ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతుబంధుతో రైతులకు ఎంతో మేలు

జగదేవ్‌పూర్, జూలై 4 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నదాతల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన రైతు బంధు, రైతుబీమా పథకాలు ఎంతో మేలు చేశాయని వాటిని వీలైనంత ఎక్కువ మంది రైతులకు లబ్ధి చేకూరేలా ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని పీఏసీఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పీఏసీఎస్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని సూచించారు. ఏవో వసంతరావు, కో-ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ నాగభూషణం, పీఏసీఎస్ సీఈవో రాములు, సీవో సత్తిరెడ్డి పాల్గొన్నారు.

పాములపర్తిలో ప్రమాదబీమా చెక్కు అందజేత

పాములపర్తిలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

మర్కూక్, జూలై 4 : మండలంలోని పాములపర్తికి చెందిన దండుబాలమల్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన పేరుపై బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో గురువారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బాలమల్లు కుటుంబానికి ప్రమాదబీమా కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును మృతుడి భార్య దండు నర్సమ్మకు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పాదపూజ

కొండపాక (కుకునూరుపల్లి), జూలై 4 : కొండపాక మండలంలోని మర్పడగ ఎంపీటీసీ పత్తి ఆంజనేయులు తన పదవీ కాలం పూర్తయిన సందర్భంగా గురువారం గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు పాదపూజ చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల కాళ్లను కడుగడంతో పాటు వారికి పూలదండలు వేసి శాలువాతో సన్మానించి, నూతన దుస్తులు, చెప్పులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీని పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులు అభినందించారు.

అంగన్‌వాడీల్లో గ్రోత్‌మేళా

హుస్నాబాద్‌టౌన్, జూలై 4 : పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం గ్రోత్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో జయమ్మ హాజరై పిల్లలను జాగ్రత్తగా తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా కేంద్రాల్లో పిల్లల తల్లిదండ్రులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ తులసి, రెండోవార్డు కౌన్సిలర్ రమాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవి త, కార్యకర్తలు సరిత, శ్రీమతి, రేణుక, స్వరూప, సుజాత, ఏఎన్‌ఎం జ్యోతి, ఆర్పీ శ్రీలత తదితరులు ఉన్నారు.

చేర్యాలలో..

చేర్యాల, జూలై 4 : పట్టణంలోని కురుమవాడ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 1, 3, 6, 11 కేంద్రాలు సంయుక్తంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి ఆధ్వర్యంలో గ్రోత్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన రామచంద్రం

రామంచంద్రం

గజ్వేల్, జూలై 04 : గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న రామచంద్రం డాక్టరేట్ పట్టా పొందారు. డాక్టర్ రత్నకుమారి పర్యవేక్షణలో 'ఆదిలాబాద్ జిల్లాలోని షెడ్యూల్‌తెగల స్వయం ఉపాధి పథకాల సమస్యలు, సూచనలు' అనే అంశంపై పరిశోధనలు జరిపినందుకు పీహెచ్‌డీలో భాగంగా ఉద్యాన విశ్వవిద్యాలయం గురువారం ఆయనకు డాక్టరేట్‌ను అందించింది. ఈ సందర్భం గా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపకులు రామచంద్రంను అభినందించారు.

కొండపోచమ్మ సాగర్ జలాశయాన్ని నింపాలి

మర్కూక్, జూలై 4 : మండల పరిధిలోని కొండపోచమ్మ సాగర్ జలాశయాన్ని నింపి రైతులకు సాగునీరు అందించాలని బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పాండుసింగ్ కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ నర్సింహులుకు నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కాల్వల ద్వారా పంటల సాగుకు నీరు అందించకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రసింగ్, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 4: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మద్దూరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంఅండ్‌హెచ్‌వో సందర్శించి దవాఖానలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతకుముందు వైద్య సిబ్బందికి ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మద్దూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రజిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

చేర్యాల, జూలై 4 : పట్టణానికి చెందిన సామల సురేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు 1988-89 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ముందుకొచ్చారు. గురువారం పూర్వ విద్యార్థులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.53వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులను అభినందించారు.

జడ్పీ చైర్ పర్సన్‌కు సన్మానం

జడ్పీ చైర్ పర్సన్ రోజారాధాకృష్ణశర్మను సన్మానిస్తున్న టీఎన్జీవోలు పంచాయతీ మినిస్టర్ ఫోరం ఉద్యోగులు

సిద్దిపేట/సిద్దిపేటఅర్బన్, జూలై 4 : సిద్దిపేట జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ పదవీ విరమణ సందర్భంగా గురువారం టీఎన్‌జీవో పంచాయతీరాజ్ మినిస్టర్ ఫోరం ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆమెను సన్మానించినట్లు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గ్యాదర్ పరమేశ్వర్, విక్రమ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ మినిస్టర్ ఫోరం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, కార్యదర్శి విజయ భాస్కర్, నాయకులు సురేందర్ రెడ్డి, వినయ సుకుమారి, జేబీనా సుల్తానా, జమున రాణి, సిద్దిపేట యూనిట్ అధ్యక్షులు శశిధర్, శ్రీనివాస్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయాలను మానుకోవాలి

హుస్నాబాద్, జూలై 4 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అని చెప్పుకుంటూ కక్ష పూరిత రాజకీయాలకు పాల్పడుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నదని బీఆర్‌ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. సమస్యలపై నిలదీస్తున్న ఎమ్మెల్యేలు, నాయకుల నోరు నొక్కుతూ అధికార నియంతృత్వాన్ని ప్రదర్శిస్తున్నదన్నారు. కరీంనగర్ జడ్పీ సమావేశంలో విద్యాశాఖలో నెలకొన్న అవినీతిపై ప్రశ్నించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై అక్రమంగా కేసు పెట్టారని, వెంటనే ఈ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సేవ చేయడం మహాభాగ్యం

కొండపాక (కుకునూరుపల్లి), జూలై 4 : ప్రజలకు సేవ చేయడం మహాభాగ్యమని, ఆ అవకాశం రావడం అదృష్టంగా భావించాలని ఎంపీపీ మంచాల అనసూయ కనకరాములు అన్నారు. గురువారం ఎంపీటీసీల పదవీ కాలం ముగింపు సందర్భంగా కొండపాక ఐవోసీలో ఎంపీపీ మంచాల అనసూయ కనకరాములు, వైస్ ఎంపీపీ దేవీ రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన ఎంపీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో వారు మాట్లాడారు. వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఎంపీటీసీలను వారు సన్మానించి మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగేందర్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు చింతల సాయిబాబాగౌడ్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ సంపూర్ణం

సిద్దిపేట అర్బన్ : మాట్లాడుతున్న పలు విద్యార్థి సంఘాల నాయకులు

సిద్దిపేట అర్బన్, జూలై 4 : విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. నీట్ పేపర్ లీకేజీతో పాటు విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ తదితర విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సిద్దిపేటలో ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి.

నీట్ అవకతవకలకు నిరసనగా..

చేర్యాల, జూలై 4 : నీట్ అవకతవకలకు నిరసనగా దేశ వ్యాప్తంగా ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, మండల కార్యదర్శి యాసిన్, నాయకులు రాహుల్, రాకేశ్‌రెడ్డి, మహేశ్, శివ, రాకేశ్, సాయి, తేజ, వంశీ, అరుణ్, ప్రశాంత్, అభిలాష్, తారక్ పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

ములుగు, జూన్ 04 : కేంద్ర ప్రభుత్వం బేషరతుగా దేశవ్యాప్తంగా నీట్ పరీక్షను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని గజ్వేల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపళ్ల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలకు నిరసనగా గురువారం మండల పరిధిలోని ప్రభుత్వ ప్రయివేట్ విద్యాసంస్థలను గురువారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిపాల్ రెడ్డి, కొండు నర్సింహులు, శ్రీను, నవీన్ కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

ఎన్‌టీఏను రద్దు చేయాలి

హుస్నాబాద్, జూలై 4: జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫమవుతున్న ఎన్‌టీఏ సంస్థను వెంటనే రద్దు చేయాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్, సనత్ రెడ్డి, బిచ్చాల శ్రీనివాస్, అభిలాశ్, అంకిత్ లతో పాటు విద్యార్థి, యువజన నాయకులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను వ్యతిరేకిస్తూ..

బెజ్జంకి, జూలై 4: కేంద్రం నిర్వహించిన నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై విద్యార్థి సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యూఐ, డివైఎఫ్‌ఐ, వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యా సంస్థలు బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ములుగులో ప్రభుత్వ జూనియర్ కళాశాల బంద్‌కు పిలుపునిస్తున్న నేతలు

మంత్రి రాజీనామా చేయాలి

కొమురవెల్లి, జూలై 4 : నీట్ పేపర్ లీకేజీపై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ కొమురవెల్లి మండల కార్యదర్శి తాడూరి భరత్ అన్నాడు. దేశవ్యాప్తంగా చేపట్టిన విద్యసంస్థల బంద్‌లో భాగంగా కొమురవెల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యసంస్థలను ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బాయ్‌కాట్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అత్తిని హారిక, వినోద్, బండి అరవింద్, సంజు, శివ, సన్నీ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా డీఈవో

నారాయణరావుపేట, జూలై 4 : మండల ప్రతేక అధికారిగా జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో యాదవరెడ్డి, హెచ్‌ఎం నాగారాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్, జూలై 4 : మండల ప్రత్యేక అధికారిగా జిల్లా సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ వినయ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం మండలాలకు ప్రత్యేక అధికారులను నియిమించినట్లు తెలిపారు. అంతకు ముందు ఆయనను ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో శ్రీనివాసవర్మ సిబ్బందితో కలిసి సన్మానించారు.

మద్దూరులో...

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 4 : మద్దూరు మండల ప్రత్యేకాధికారిగా వ్యవసాయశాఖ చేర్యాల ఏడీఏ రాధికను నియమిస్తూ కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఆమె మండల ప్రత్యేకాధికారిగా రాధిక బాధ్యతలు స్వీకరించింది.

వర్గల్‌లో..

వర్గల్, జూలై 4 : వర్గల్ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ఎస్సీ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కవిత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర వసతుల్లో ఎలాంటి ఇబ్బంది ఏర్పడకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

జాతీయస్థాయి వాలీబాల్ శిక్షణకు విద్యార్థి ఎంపిక

గజ్వేల్, జూలై 4 : జాతీయస్థాయి అండర్-17 బాలీబాల్ విభాగంలో పాండిచ్చేరిలో జరిగే శిక్షణ కోసం మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లికి చెందిన చిగుర్ల సృజన్‌కుమార్ ఎంపికయ్యారని జాతీయ వాలీబాల్ శిక్షకుడు సంతోశ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సృజన్‌కుమార్‌కు వర్గల్ మం డల పరిధిలోని చౌదర్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గుప్తా క్రీడా సామగ్రిని అందజేశారు.

పేకాట స్థావరాలపై దాడులు

కోహెడ జూలై 4 : మండల కేంద్రంలోని తంగళ్లపల్లి శివారులో పేకాల స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు కోహెడ పోలీసులతో కలిసి దాడులు చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని ఆదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.9,390 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే తంగళ్లపల్లిలోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,550 నగదు, ఏడు సెల్‌ఫోను, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కోతుల దాడిలో విద్యార్థికి గాయాలు

కొమురవెల్లి, జూలై 4 : కోతుల దాడిలో విద్యార్థికి గాయాలైన ఘటన గురువారం మండల పరిధిలోని గురువన్నపేటలో జరిగింది.గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వరుగంటి దేవిశ్రీప్రసాద్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రోజు మాదిరిగానే తన స్నేహితులతో నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో పాఠశాల సమీపంలో చెట్లపొదల్లో ఉన్న కోతులు ఒక్కసారిగా దాడి చేయడంతో గాయపడ్డారు. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఖాజీపూర్‌లో కనువిప్పు

దుబ్బాక, జూలై 4 : నియోజకవర్గంలోని భూంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని ఖాజీపూర్‌లో బుధవారం రాత్రి పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూంపల్లి ఎస్సై హరీశ్‌గౌడ్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసగా మారి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు కళాబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

కొమురవెల్లి, జూలై 4 : మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఎస్సై లింగంపల్లి రాజు ఆధ్వర్యంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ పందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయిన, వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వడ్డీ లేకుండా ఆటోలకు రుణాలు

సిద్దిపేట టౌన్, జూలై 4 : వడ్డీ లేకుండా ఆటోలకు సిద్దిపేట ఖిద్మత్ సొసైటీ రుణాలను ఇస్తున్నదని ఖిద్మత్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ అన్నారు. జిల్లా కేంద్రం సిద్దిపేట ఖిద్మత్ సొసైటీ వారు ఆటోలు నడుపుతూ జీవిస్తున్న పేద వారి కోసం వడ్డీ లేని రుణాల నూతన పథకాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జుబేర్ ఖుద్దూస్, అంజాద్, ఉబెద్, న్యాయవాది రఫీ తదితరులు పాల్గొన్నారు.